క్లుప్తంగా

రైల్వే ఇనిస్టిట్యూట్ ఎన్నికల్లో సంఘ్ విజయం

తెనాలి రూరల్: తెనాలి రైల్వే ఇనిస్టిట్యూట్ నూతన కార్యవర్గం కోసం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, మజ్దూర్ యూనియన్ల మధ్య బుధవారం రాత్రి జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో ఎంప్లాయీస్ సంఘ్ ఘన విజయం సాధించింది. విజయం సాధించిన ప్యానల్ సభ్యుల్ని సంఘ్ సభ్యులు అభినందించారు. ఈ విజయాన్ని ఎంప్లాయీస్ సంఘ జనరల్ సెక్రెటరీ రాఘవయ్యకు అంకితమించినట్లు నాయకులు పేర్కొన్నారు. రైల్వే ఇనిస్టిట్యూట్ నూతన కార్యదర్శిగా రాజేష్, జోనల్ సెక్రెటరీగా ఉదయ్ కుమార్, ట్రెజరర్‌గా బి.గౌరీశంకరరావుతో పాటు మరో ఆరుగురు సభ్యులు విజయం సాధించారు. డివిజన్ సెక్రటరీ ఆమంచి వెంకటేశ్వరరావు, తెనాలి సెక్రటరీ బాజీ హుస్సేన్, కార్యవర్గ సభ్యులు గోపాలం శ్రీనివాసరావు, ఉషశ్రీ పాల్గొన్నారు. తొలుత రైల్వేస్టేషన్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

గ్యాస్ లీక్‌తో అగ్ని ప్రమాదం

- ఇంట్లో సామగ్రి దగ్ధం
- రూ. 2.50 లక్షల నష్టం

తెనాలి రూరల్: పండుగ వేళ స్థానిక మోరిస్‌పేటలోని ఓ ఇంట్లో గురువారం అగ్ని ప్రమాదం జరిగింది. వంటింట్లో గ్యాస్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగి సామగ్రి మొత్తం కాలి బూడిదైంది. అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని మంటల్ని అదుపు చేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. మోరిస్‌పేటకు చెందిన సుభాని బక్రీద్ పండుగ సందర్భంగా ఇంట్లో చిన్న ఫంక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా మొదటి అంతస్తులోని వంటింట్లో గ్యాస్ సిలెండర్ లీకై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అదుపుచేసే ప్రయత్నం చేసినప్పటికీ వీలుకాకపోగా మంటలు చుట్టుముడుతుండటంతో ఇంట్లోని వారంతా భయంతో బయటకు పరుగులు తీశారు. అగ్నిమాపక అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ కె. జితేంద్ర కుమార్ సిబ్బందితో అక్కడకు చేరుకుని మంటల్ని అదుపు చేశారు. ఆ లోగానే ఇంట్లోని వంట సామగ్రి, ఫ్రిడ్జ్, ఏసీలు, ఫ్యాన్‌లు, కప్‌బోర్డులు కాలి బూడిదయ్యాయి. ప్రమాదంలో ప్రాణాపాయం లేదని, ఆస్తి నష్టం మాత్రం సుమారు రూ. 2.50 లక్షలవరకు ఉంటుందని అధికారులు తెలిపారు.

వృద్ధులకు అన్నదానం



తెనాలి టౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా ఆశ్రమంలోని వృద్ధులకు గురువారం మలిశెట్టి శివశంకర్ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని ముఖ్య అతిథిగా పాల్గొన్న అక్కిశెట్టి వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవసేవతోనే జన్మ చరితార్థ అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆశ్రమ వ్యవస్థాపకులు వజ్రాల రామలింగాచారి, పి.కుటుంబరావు, వై.కోటేశ్వరరావు, కృష్ణమాధవ్ పాల్గొన్నారు.

2న జగ్జీవన్‌రామ్ విగ్రహావిష్కరణ



తెనాలి టౌన్: చేబ్రోలులో జులై రెండున జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు ఎమ్మార్పీఎస్, బీజేఆర్ యూత్ నాయకులు తెలిపారు. మారీసుపేటలోని బీజేఆర్ కార్యాలయంలో గురువారం విగ్రహావిష్కరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ పాల్గొంటారన్నారు. తెనాలి డివిజన్‌లోని ఎమ్మార్పీఎస్ నాయకులు, బీజేఆర్ యూత్ సభ్యులు, దళిత మేధావులు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో అత్తోట చంటి, మేకల సురేష్, నలుకుర్తి రమేష్, కారుమూరి రాజేంద్రప్రసాద్, యడ్లపల్లి అనిల్‌కుమార్, పులి ప్రభుదాసు, జి.ప్రసాద్, సిద్దెల కమలాకర్ పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్: మండలంలోని నందివెలుగు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ. 1550 స్వాధీనం చేసుకున్నారు. నాలుగు బైక్‌లు, ఆటో సీజ్ చేశారు. నిందితుల్ని శుక్రవారం కోర్టులో హాజరుపరచనున్నట్లు ఎస్ఐ తెలిపారు.

భార్యను బెదిరించిన ఘటనపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: నగ్న చిత్రాలు సోషల్ మీడియాలో పెడతానని భర్త బెదిరించిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. శ్రీనగర్‌లో నివసించే ఏ.వెంకటేశ్వరరావు తన భార్య గీతిక నగ్న చిత్రాలు సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించాడు. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



తెనాలి చెంచుపేటలోని ఈద్గాలో ముస్లింల ప్రార్థనలు

తెనాలి: త్యాగానికి ప్రతిరూపమైన ఈదుల్ అజ్‌హా (బక్రీద్) పండుగను గురువారం పట్టణంలోని ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. స్థానికంగా గల 21 మసీదుల పరిధిలోని ముస్లింలు, ముతవల్లీలు ఉదయాన్నే నూతన వస్త్రాల్ని ధరించారు. తలపై టోపీలు పెట్టుకుని 'అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ లాఇలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్' స్తోత్రాన్ని పఠిస్తూ, పరగడుపున చెంచుపేటలోని ఈద్గాకు తరలివెళ్లారు. మదీనా మసీదు ఇమామ్ ముఫ్తీ ఉస్మాన్ సాహెబ్ ఆధ్వర్యంలో నమాజు చేశారు. బక్రీద్ రోజున విధిగా నమాజు చదివిన తర్వాతే ఖుర్బానీ (పశు త్యాగం) ఇవ్వాలి. వీరి సౌలభ్యం కోసం కొన్ని స్థానిక మసీదుల్లో ఆరు గంటల్నుంచే నమాజు చేశారు. ఇస్లాంపేటలోని మర్కస్ మసీదులో మౌలానా అబ్దుల్లా ఆధ్వర్యంలో, గాంధీనగర్‌లోని మస్జిద్-ఏ-ఆయేషా సిద్దిఖాలో ముఫ్తీ ఇర్ఫాన్ ఆధ్వర్యంలో, పాత ప్రభుత్వ ఆసుపత్రి చారిత్రాత్మక జామియా మస్జిద్‌లో హాఫీజ్ ఎండీ ఇమ్రాన్ నేతృత్వంలో, పాండురంగపేటలోని మక్కా మసీదులో మౌలానా ఇమ్రాన్ ఆధ్వర్యంలో నమాజ్ జరిగింది. రైస్ కాలనీలో ఉస్మానియా మసీదు, చినరావూరుతోటలోని నూరియా మసీదు, అఖ్తా మసీదు పరిధిలోని ముస్లింలు, ఉదయం 7.30 గంటలకు నూకల రామకోటేశ్వరరావు కల్యాణ మండపంలో ప్రార్థనలు చేశారు. నమాజు అనంతరం ఇంటికి చేరుకున్నాక, ఆర్థిక స్తోమత గలవారు ఖుర్బానీ నిర్వహించారు. ఆ మాంసాన్ని మూడు భాగాలు చేసి, ఒక భాగాన్ని తాము ఉంచుకుని, రెండో భాగాన్ని బంధువులకు, మూడో భాగాన్ని పేదలకు పంచారు. అందుకే ఈ పండుగను 'ఈదె ఖుర్బాన్' గానూ వ్యవహరిస్తారు.

నీట్-పీజీ ఎంట్రన్స్‌లో గుణవర్ధనరెడ్డికి ర్యాంకు



తల్లిదండ్రులతో గుణవర్ధనరెడ్డి

తెనాలి: తమ వంశంలో ఎవరూ డాక్టర్లు లేరు... తమ ఏకైక బిడ్డ డాక్టరు కావాలనేది ఆ దంపతుల ఆకాంక్ష...చిన్నతనం నుంచీ ఆ కొడుకు చదువులో చక్కగా రాణిస్తుండటం కూడా వారికి ఆశల్ని రేకెత్తించింది. చదువుకు ఆటంకం కారాదని పల్లెటూరు నుంచి పట్టణానికి మకాం మార్చారు. తల్లిదండ్రుల కోరిక ప్రకారం ఎంబీబీఎస్ చేయడమే కాకుండా నీట్-పీజీ ఎంట్రెన్స్‌లోనూ జాతీయస్థాయిలో ర్యాంకు సాధించాడా కుర్రోడు...పెద్దల కలల్ని సాకారం చేశాడు. ఆ వివరాలివి. అవుతు వెంకటరెడ్డి-హరిత దంపతులది తెనాలి నియోజకవర్గంలోని కొల్లిపర మండల గ్రామం చివలూరు. కొద్దిపాటి వ్యవసాయమే వారి జీవనోపాధి. ఏకైక కుమారుడు గుణవర్ధనరెడ్డిని చక్కగా చదివించాలని తలపోశారు. గ్రామంలో ఉంటే కొడుకు చదువుకు ఆటంకమని తెనాలికి వచ్చేశారు. పట్టణంలో ఉంటూ గ్రామంలో వ్యవసాయం చూసుకుంటున్నారు. కొడుకును మంచి పాఠశాలలో చదివించసాగారు. అనుకున్నట్టే చక్కగా చదువుతూ వచ్చిన గుణవర్ధనరెడ్డిని డాక్టరును చేయాలని ఆశించారు.విజయవాడలోని ఓ కార్పొరేట్ కాలేజీలో ఇంటర్ బైపీసీ గ్రూపులో చేర్పించారు. మంచి మార్కులతో ఉత్తీర్ణుడైన గుణవర్ధనరెడ్డి, నీట్ పరీక్షల్లో స్టేట్ 172వ ర్యాంకును సాధించాడు. తమ కల నెరవేరిందన్న సంతోషం ఆ పెద్దలది. గుంటూరు మెడికల్ కాలేజీలో 2017-2023లో ఎంబీబీఎస్ పూర్తిచేశాక పీజీ చేయాలన్న భావనతో నీట్-పీజీ ఎంట్రెన్స్‌ను గత మార్చిలో రాశాడు. ఈనెల 14న వచ్చిన ఫలితాల్లో మొత్తం జాతీయస్థాయిలో 158వ ర్యాంకు, రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకును సాధించాడు. తల్లిదండ్రుల కలల్ని మించి సాధించిన కొడుకును చూసి వెంకటరెడ్డి, హరిత దంపతులు ఆనందపడుతున్నారు. ఎండీ జనరల్ మెడిసిన్ చదువుతానని, తర్వాత సూపర్ స్పెషాలిటీలో ఎండీ కార్డియాలజీ చేయాలనేది తన ఆశయంగా గుణవర్ధనరెడ్డి 'సాక్షి'తో చెప్పారు. ఆల్ ది బెస్ట్ చెబుదాం.

జగనన్న సురక్షతో సత్వర పరిష్కారం

ఫిరంగిపురం: జగనన్న సురక్షతో ప్రజా సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని ప్రత్యేకాధికారి యుగంధర్‌కుమార్ అన్నారు. మండలంలోని వేములూరిపాడు, అమీనాబాద్ గ్రామాల్లో గురువారం జగనన్న సురక్షపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రత్యేకాధికారి యుగంధర్ కుమార్ సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న సురక్షతో 11 రకాల సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఇంకా అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే అటువంటి వారిని గుర్తించి పేర్లు నమోదు చేసి, వలంటీర్ల సాయంతో దరఖాస్తు చేయించి, జగనన్న సురక్ష ద్వారా వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఏకే.బాబు, మధు, కె.ఆనంద్, సిబ్బంది, వలంటీర్లు ఉన్నారు.

జీ చానల్ కరకట్టపై బీటీ రోడ్డు నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్

- ఇరిగేషన్ శాఖ అభ్యంతరంతో నిలిచిన పనులు
- ఎంపీ అయోధ్య రామిరెడ్డి చొరవతో తిరిగి అనుమతులు
- టెండర్లు పిలిచేందుకు సిద్ధమవుతున్న నగర పాలక సంస్థ



ఇరిగేషన్ శాఖ అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన గుంటూరు చానల్ రహదారి

తాడేపల్లిరూరల్: గుంటూరు చానల్ కరకట్ట మీదుగా పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ వరకు రహదారి నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ లభించింది. దీంతో మరోసారి టెండర్లు పిలిచేందుకు నగరపాలక సంస్థ అధికారులు సిద్ధమవుతున్నారు. విజయవాడ గుంటూరు మహానగరాల మధ్యలో పలు ప్రాంతాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఉండవల్లి లాంటి ప్రాంతాల్లో ఎంతో మంది స్థలాలు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలో పంట పొలాలు సైతం నివాస స్థలాలుగా మారాయి. ఉండవల్లి గుంటూరు చానెల్ హెడ్ స్లూయిజ్ నుంచి పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ వరకు పంట పొలాలు నివాస ప్రాంతంగా మారాయి. ఆ ప్రాంతంలో సరైన రహదారుల నిర్మాణాలు లేవు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి కావడంతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నగరపాలక సంస్థ అధికారులతో కలసి పర్యటించారు. ఉండవల్లి దళితవాడ కరకట్ట నుంచి గుంటూరు చానల్ కరకట్ట మీదుగా పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ వరకు రహదారి నిర్మాణం చేస్తే బాపనయ్యనగర్, సాయినగర్‌లతో పాటు అమరావతికి వెళ్లే రహదారిలో ఉన్న నాలుగు బజార్లలో నివసించే వారు విజయవాడ వెళ్లేందుకు ఉపయోగించవచ్చని నిర్ధారించారు. నాలుగు రోడ్ల కూడలి అయిన ఉండవల్లి సెంటర్‌లో ట్రాఫిక్ జామ్ అయినపుడు అమరావతి రోడ్డు నుంచి నేరుగా ప్రకాశం బ్యారేజ్‌కు వెళ్లేందుకు ఉపయోగపడుతుందని నిర్ణయించి తొలుత రూ. రెండు కోట్ల వ్యయంతో గ్రావెల్ రోడ్ నిర్మాణం చేపట్టారు. అనంతరం బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.50 కోట్లు కార్పొరేషన్ స్పెషల్ గ్రాంట్ నుంచి కేటాయించారు. రహదారి నిర్మాణం చేస్తున్న సమయంలో ఇరిగేషన్ అధికారులు అభ్యంతరం చెప్పడంతో తాత్కాలికంగా పనులు నిలిచిపోయాయి. ఎమ్మెల్యే ఆర్కే, ఎంపీ అయోధ్య రామిరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన ఇరిగేషన్ ఉన్నతాధికారులతో మాట్లాడి కరకట్ట మీద బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు అనుమతులు తీసుకువచ్చారు. త్వరలోనే టెండర్లు పిలిచి ఆ రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.

ప్రజా సమస్యలపై పోరాడేందుకు యువత సిద్ధంకావాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

నగరంపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వెనుక ఉన్న మతోన్మాద ఆర్‌ఎస్‌ఎస్ దేశాన్ని తిరోగమనంలో నడిపిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఏపీ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో రాజగారితోట శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి యువజన, విద్య, వైజ్ఞానిక సాంస్కృతిక సమ్మేళనంలో భాగంగా గురువారం 'భారత దేశ రాజకీయాలు- యువత పాత్ర' అనే అంశంపై ఆయన మాట్లాడారు. సభకు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ అవినీతి, అనైతిక పాలనకు వ్యతిరేకంగా ప్రజా సమస్యలపై పోరాడేందుకు యువత మిలిటెంట్ పోరాటాలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. బీజేపీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. కామన్ సివిల్ కోడ్ రావాలని ప్రధాని మోదీ వ్యాఖ్యానించడం ఆందోళనకరమైన అంశమని పేర్కొన్నారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే కామన్ సివిల్ కోడ్ తీసుకొస్తుందని ఆరోపించారు. ఐపీసీ అందరికీ సమానంగా ఉంటుందని, సివిల్ అంశాలు ఎవరి మతానికి సంబంధించి వారికి వేర్వేరుగా ఉంటాయని చెప్పారు. కామన్ సివిల్ కోడ్‌తో మతాలు మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ స్టీల్ ప్లాంటును ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్రం ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీ కోసం గుంటూరు నుంచి అమృతరావు ఉద్యమం చేపట్టారని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనేపూడి శంకరరావు, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు. అనంతరం నగరంలో ప్రదర్శన చేపట్టారు.

బ్యాగ్‌లో ఆభరణాల చోరీ

పట్నంబజార్: బ్యాగ్‌లో ఆభరణాలు చోరీకి గురైన సంఘటనపై కేసు నమోదైంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన రేవతి కుటుంబంతో కలసి బెంగళూరు నుంచి వయా గుంటూరు మీదుగా బస్సులో ప్రయాణం చేస్తున్నారు. ఈ క్రమంలో గుంటూరు కాకాని రోడ్డులోకి రాగానే బ్యాగ్ కత్తిరించి ఉండటాన్ని గమనించారు. అందులోని 130 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త కార్యాలయంపై భార్య దాడి

మహిళ అనుచరులతో వెళ్లి భర్త ఆఫీసు తాళాలు పగులగొట్టి నగదు, పత్రాలు తీసుకువెళ్లిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. కన్నావారితోటలోని భర్త అమృతలూరి వెంకటేశ్వరరావు కార్యాలయానికి గీతిక అనుచరులతో బుధవారం వెళ్లి తాళాలు పగులగొట్టింది. కార్యాలయంలోని రూ. 2 లక్షలతో పాటు విలువైన పత్రాలు ఎత్తుకు వెళ్లింది. వెంకటేశ్వరరావు ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద పోలీసు బందోబస్త్



ప్రార్థన స్థలం వద్ద పోలీసుల పహారా

నగరంపాలెం: బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం జిల్లా పరిధిలోని ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మసీదులు, ప్రార్థన స్థలాల వద్ద పోలీసులు బందోబస్త్ ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది పటిష్టమైన భద్రత చర్యల్ని చేపట్టారు. ప్రార్థనలకు అంతరాయం ఏర్పడకుండా ట్రాఫిక్‌ను నియంత్రిస్తూ విధులు నిర్వహించారు.

4,564 కేసులు నమోదు

బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగే వారిని గుర్తించేందుకు గురువారం జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. బహిరంగంగా మద్యం తాగే 4,836 మందిపై 4,564 కేసులు నమోదు చేశారు. మద్యం తాగే వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. మత్తులో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు అవకాశాలు ఉన్నాయని, కుటుంబం ఆర్థికంగా నష్టపోతుందని హితబోధ చేశారు.

పోలీసులు నిజాయతీగా ఉండాలి

జిల్లాలోని పోలీస్ యంత్రాంగం విధి నిర్వహణలో నిజాయతీగా ఉండాలని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి ఆరోపణలకు అవకాశం లేకుండా జవాబుదారీతనంతో, క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని సూచించారు.

గుంటూరు చానల్‌లో తూటాకు తొలగింపు



తాడేపల్లిరూరల్: గుంటూరు చానల్‌లో తూటాకు తొలగింపు పనులను ఇరిగేషన్ అధికారులు ఎట్టకేలకు గురువారం ప్రారంభించారు. కృష్ణానది ఎగువ నుంచి గుంటూరు చానల్ ద్వారా తాగు, సాగునీటిని అందిస్తున్నారు. కాలువలో కొంతకాలంగా తూటాకు పెరిగిపోవడంతో రైతులతోపాటు పలు గ్రామాల ప్రజలు తాగునీటి అవసరాలకు ఇబ్బంది పడుతున్నారు. గుంటూరు చానల్ జేఈ అన్వేష్ మాట్లాడుతూ ప్రస్తుతం జీరో పాయింట్ నుంచి 14.4 కిలో మీటర్ వరకు గుంటూరు చానల్‌లో ఉన్న తూటాకు తొలగిస్తున్నామని, తూటాకు తొలగించిన అనంతరం దెబ్బతిన్న రివిట్ వాల్, కోతకు గురైన కట్టను మరమ్మతులు చేసేందుకు మొత్తం రూ.24 లక్షలు కేటాయించామని, త్వరితగతిన ఈ పనులు పూర్తిచేసి గుంటూరు చానల్‌కు సాగు, తాగునీరు అందజేయనున్నట్లు తెలిపారు.

శ్రీ విద్యాపీఠంలో తొలి ఏకాదశి పూజలు



మారీసుపేటలోని వీరాంజనేయస్వామి ఆలయంలో విశేషాలంకరణలో స్వామి



శ్రీ విద్యాపీఠంలో పూజలు చేస్తున్న బాలస్వామీజీ



వైకుంఠపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో విష్ణు సహస్ర పారాయణం చేస్తున్న మహిళలు

తెనాలి టౌన్: గంగానమ్మ పేటలోని శ్రీ విద్యాపీఠంలో సాలీగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం తొలి ఏకాదశి వేడుకల్ని నిర్వహించారు. బాలస్వామీజీ ప్రత్యేక పూజలు చేసి, ఏకాదశి విశిష్టతను భక్తులకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై మూడు నుంచి సెప్టెంబర్ 29వరకు 90 రోజుల పాటు అర్ధచాతుర్మాస పూజలు శ్రీశైల క్షేత్రంలో జరుగుతాయని, భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో మఠం ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకటకృష్ణమూర్తి, ఉప్పల నాగేశ్వరరావు, ఎం.రమణయ్య, గోవు రామకృష్ణ, చుండూరు లోకనాథం, రాజేశ్వరరావు, కాశీ విశ్వనాథం, శ్రీరామ్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

+మారీసుపేటలోని వీరాంజనేయస్వామి మందిరంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా పూజలు నిర్వహించారు. మందిరంలోని శ్రీ మహావిష్ణువుకు క్షీరాభిషేకం చేసి, తులసీ దళార్చనతో పూజలు జరిపారు. ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

- మారీసుపేటలోని శ్రీ అప్పలస్వామి గుడిలో తొలి ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామికి విశేష అలంకరణ జరిపి పూజలు జరిపారు. భక్తులు విష్ణుసహస్రనామ పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాల అందజేశారు. కార్యక్రమంలో మేనేజింగ్ ట్రస్టీ లంక శివనంద కుమార్, కోశాధికారి కూనపల్లి నారాయణస్వామి, ప్రధాన అర్చకులు నాగసర్వజ్ఞ శర్మ, తేజుబాబు, పవన్, శివాంజనేయప్రసాద్, పాల్గొన్నారు.
- వైకుంఠపురంలోని శ్రీ లక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి సందర్భంగా సంకీర్తన బృందం సభ్యులు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. ఉత్సవమూర్తుల్ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నెల రోజుల్లో డ్రెయిన్ పనుల పూర్తి

- డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి
- చిర్రావూరు ప్రజలకు హామీ



రైతులతో మాట్లాడుతున్న డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి తదితరులు

తాడేపల్లి రూరల్: ఔట్ పాల్ డ్రెయిన్‌లో మురుగు ప్రవహించినపుడే సమస్య పరిష్కారమవుతుందని, రైతులు, నివాసితులు అందుకు సహకరించాలని నగరపాలక సంస్థ డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి కోరారు. నగర పాలక సంస్థ పరిధిలోని చిర్రావూరు నుంచి మంగళగిరి రూరల్ రామచంద్రాపురం వరకు ఔట్‌పాల్ డ్రెయిన్ పూడికతీత పనులు ఎమ్మెల్యే ఆర్కే సూచనల మేరకు డీఈ కృష్ణారెడ్డి పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఈ పనుల్లో కొంత జాప్యం జరగడంతో డెప్యూటీ కమిషనర్ శివారెడ్డి గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ చిర్రావూరు ప్రాంతంలో మురుగు సమస్యతోపాటు పంటపొలాల్లో మురుగు సమస్యను పరిష్కరించాలంటే తప్పని సరిగా రెండు కిలోమీటర్ల మేర ఔట్ పాల్ డ్రెయిన్ నిర్మాణం చేపట్టాలని, రైతులు, కరకట్ట వెంబడి నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉన్న వారు సహకరిస్తే నెల రోజుల వ్యవధిలో పనులను పూర్తిచేస్తామన్నారు. చిర్రావూరు నుంచి మురుగు వెళ్లాలంటే కరకట్టను ఆనుకుని రెండు కల్వర్ట్‌ల నిర్మాణాలు చేపట్టాలని, ఆ పనులు ప్రారంభించాలంటే అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. డ్రెయిన్ నిర్మాణం వల్ల చిర్రావూరు గుండిమెడ డొంక నుంచి పంటపొలాల్లో నీటితో పాటు గ్రామంలోని మురుగు మొత్తం బయటకు పంపవచ్చని, నేడు టౌన్ ప్లానింగ్ అధికారులతో పాటు సర్వేయర్లు వచ్చి పరిశీలించి లెవలింగ్ వేసి పనులు చేపడతారని దయచేసి ఎవరూ అభ్యంతరం చెప్పకుండా పనులు జరిగేలా చూడాలని, మీ అందరూ సహకరిస్తే 15 నుంచి 30 రోజుల లోపు నిర్మాణ పనులు పూర్తవుతాయని అన్నారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, ఏఈలు కిషోర్, ప్రవీణ్, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా జగనన్న పాలన

జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా



మండల పరిషత్ కార్యాలయ భవనం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

తాడికొండ: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతుందని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా, వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్ అన్నారు. తాడికొండలో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ కార్యాలయ భవనాన్ని నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డితో కలసి వారు గురువారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని పేదవాడికి చేరువ చేయడంలో దేశంలోనే ఏపీ నంబర్ వన్ స్థానంలో ఉందని, అందుకు గ్రామస్థాయిలో నిర్మిస్తున్న సచివాలయాలు, ఆర్‌బీకే, హెల్త్ క్లినిక్‌లు ఇతర సదుపాయాలే నిదర్శనం అన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు అందుతున్నాయంటే దానికి జగనన్న చిత్తశుద్ధి పాలనే కారణమన్నారు. సాంకేతిక, ఇతర కారణాలతో ఎవరికైనా సంక్షేమ పథకాలు ఆగిపోతే వారికి కూడా అర్హత కల్పించేందుకు ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష పథకం అందరికీ వరమన్నారు. నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న సంక్షేమ పాలనతో అన్ని వర్గాలు సంతోషంగా ఉన్నాయని, కేవలం ఒక వర్గమే దుష్ప్రచారం చేస్తుందనేది స్పష్టమన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు అనుభవిస్తున్న పేదలు 85 శాతం మంది సంతృప్తిగా ఉన్నారని, రాష్ట్రంలో 78 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కుటుంబాలకు న్యాయం జరిగి సమసమాజ స్థాపన జరగాలంటే జగనన్న పాలన మళ్లీ రావాలన్నారు. ఎంతమంది విమర్శలు చేసినా ఉన్నత భవిష్యత్తు కోసం ప్రజలు రాబోయే ఎన్నికల్లో సీఎంగా వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. గతంలో ఎన్నికల హామీలు విస్మరించి పేదలను మోసం చేసిన చంద్రబాబు నేడు ఎన్నికల ముందు దొంగ హామీలు ఇవ్వడం చూసి ప్రజలు నవ్వుతున్నారని, ఆయన్ను ఎప్పటికీ నమ్మరన్నారు. ఎంపీపీ తాళ్ల భాగ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ రెడ్డి త్రివేణి, మాజీ ఎంపీపీలు బండ్ల పున్నారావు, కొమ్మినేని రామచంద్రరావు, డీసీఎంఎస్ డైరెక్టర్ దాసరి రాజు, యార్డు మాజీ చైర్మన్ దాములూరి రాము, రాష్ట్ర కార్యదర్శి బొర్రా వెంకటేశ్వరరెడ్డి, ఎంపీడీఓ అత్తోట దీప్తి, ఎంఈఓ తెనాలి ఇందిర, జిల్లా కార్యదర్శి మల్లంపాటి రాఘవరెడ్డి, తోకల నరసింహారావు పాల్గొన్నారు.

ట్రావెల్ ఏజెన్సీ మోసం

గుంటూరు ఈస్ట్: ట్రావెల్ ఏజెన్సీ మోసం చేసిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. హెర్బల్ లైఫ్‌లో సీనియర్ వెల్‌నెస్ కోచ్‌గా పనిచేసే వేముల రమాదేవి ఈ నెల 21న కుందుల రోడ్డులోని చైతన్య హ్యాపీ ట్రిప్స్ ట్రావెల్ ఏజెన్సీకి వెళ్లారు. కంపెనీ సభ్యులు 40 మంది బెంగుళూరు వెళ్లేందుకు చార్జీల కింద రూ. 2,15,000ను ఉషారాణి అకౌంట్‌కు చెల్లించారు. అయితే, ట్రావెల్ ఏజెన్సీ బస్సు ఏర్పాటు చేయలేదు. రమాదేవి డబ్బులు అడగ్గా, ఏజెన్సీ నిర్వాహకులైన పవన్‌కుమార్, ఉషారాణి, దొరబాబు డబ్బులు ఇవ్వడానికి నిరాకరించి దుర్భాషలాడి బెదిరించారు. రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.